సాక్షి
కర్నూలు
గురువారం। 3। అక్టోబర్। 2024



ముగిసిన ఫుట్‌బాల్ టోర్నీ

కర్నూలు నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న సీబీఎస్‌ఈ క్లస్టర్–7 ఫుట్‌బాల్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. 8లో▸



వీరభద్రస్వామికి విశేషార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడైన బయలువీరభద్రస్వామికి బుధవారం అమావాస్య సందర్భంగా విశేషార్చన జరిపించారు. పరోక్ష సేవలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.



టీబీ డ్యాం సమాచారం


పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.87
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.272
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,726
అవుట్ ఫ్లో	:10,175

తమ్ముళ్లకు కిక్కే కిక్కు

- దసరా కానుకగా మద్యం దుకాణాలను ప్రారంభించనున్న ప్రభుత్వం
- కర్నూలులో 99, నంద్యాలలో 105 దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- బాటిల్ ఎమ్మార్పీపై 20 శాతం లాభం
- అదనంగా రూ.20–30 పెంచేసుకోండని ప్రభుత్వ పెద్దల సూచన
- సిండికేట్‌లో టీడీపీ నాయకులను ఎక్కువగా కలుపుకుని లాభం చేకూర్చడమే లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో ఏడాదికి రూ.182.13 కోట్ల లాభం ఆర్జించనున్న వ్యాపారులు
- మామూళ్ల పంట పండుతుందనే ఆనందంలో ఎక్సైజ్, సివిల్ పోలీసులు

నూతన మద్యం పాలసీ కిక్కుతో తమ్ముళ్లు పండగ చేసుకుంటున్నారు. 'మందు' చూపుతో లిక్కర్ దందాకు సిండికేట్ మార్గాన్ని ఎంచుకుని మందుబాబులను దోచుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వ పెద్దల ఆశీర్వాదం.. అధికారుల సహకారంతో రెండేళ్ల పాటు దోపిడీకి కూటమి కదుతున్నారు. దుకాణాలకు పోటీ లేకుండా మధ్యేమార్గంగా లాభాలను పంచుకునేందుకు పావులు కదుపుతున్నారు. అక్రమంగా అదనపు ఆదాయాన్ని ఆర్జించేందుకు లెక్కలు వేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి కర్నూలు



తాగినోళ్లకు తాగినంత మద్యం అంటూ రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రకటించింది. ఇక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మద్యం ఏరులై పారనుంది. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. గతంలో మద్యం విక్రయాలు ఎమ్మార్పీకే విక్రయించి మందుబాబులపై భారం లేకుండా గత ప్రభుత్వం చేస్తే, ప్రస్తుత సర్కారు మద్యం బాటిళ్లపై ఎమ్మార్పీ కంటే రూ.20–30 అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేలా దుకాణాలను ప్రైవేటు పరం చేస్తోంది. లాటరీలో దుకాణాలు దక్కించుకునే వ్యాపారులు 'సిండికేట్'గా ఏర్పడి లాభాన్ని పంచుకోనున్నారు. టీడీపీలో క్రియాశీలకంగా పని చేసిన నాయకులు, ముఖ్య కార్యకర్తలను 'సిండికేట్'గా చేర్చుకుని వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం పావులు కదుపుతోంది. దీంతో మద్యం విక్రయాల ద్వారా వచ్చే లాభంతో పాటు అధిక ధరలకు విక్రయించడం ద్వారా వచ్చే అదనపు ఆదాయం ఉమ్మడి జిల్లా వ్యాపారులకు ఏడాదికి రూ.182.13 కోట్లు సమకూరనుంది. రెండేళ్లపాటు దుకాణాలు నడవడంతో తొలివిడత దుకాణాలు దక్కించుకున్న 'సిండికేట్ తమ్ముళ్ల'కు రెండేళ్లలోరూ.364 కోట్లకుపైగా లాభం చేకూరనుంది. మద్యం దుకాణాలకు మంగళవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావడంతో రెండు జిల్లాల్లోని తమ్ముళ్లంతా దరఖాస్తులు, సిండికేట్, వ్యాపారం, లాభం అనే అంశాలపైనే చర్చ సాగిస్తూ దుకాణాల ఏర్పాటుపైనే తలమునకలై ఉన్నారు. కొత్త మద్యం పాలసీ ద్వారా కర్నూలులో 99, నంద్యాలలో 105 కలిపి మొత్తం 204 దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రెండేళ్లపాటు లీజుదారుడు దుకాణం నడుపుతారు. ఏడాదికి దుకాణాన్ని బట్టి రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షలు లైసెన్స్ ఫీజు అబ్కారీశాఖకు చెల్లించాలి. వ్యాపారులు విక్రయాలు సాగించే బాటిళ్లలో బాటిల్‌పై 20 శాతం లాభం ప్రకటించింది. అంటే రూ.వంద రూపాయల బాటిల్‌పై రూ.20, వెయ్యి రూపాయల బాటిల్‌పై రూ.200 లాభం వస్తుంది.

కూటమి నేతలే లిక్కర్ కింగ్‌లు..

దుకాణాలు దక్కించుకున్న వ్యక్తులు ఎమ్మార్పీపై విక్రయాలు సాగించాలి. 2014–19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మార్పీ కంటే బాటిల్‌పై రూ.10–30 ఎక్కువ విక్రయించి సొమ్ము చేసుకున్నారు. దీంతో గత ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తులకు కాకుండా ప్రభుత్వమే నిర్వహించి ఎమ్మార్పీకి విక్రయించేలా చర్యలు తీసుకుంది. ఆదాయాన్ని కూడా ప్రభుత్వ ఖజానాకు మళ్లించింది. అయితే ఇప్పుడు తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలోని 'కూటమి ప్రభుత్వం' కొలువుదీరింది. దీంతో కూటమి నేతలు, కార్యకర్తలకు ఆర్థికంగా మేలు చేసే ప్రధాన లక్ష్యంతోనే మద్యం వ్యాపారాన్ని తిరిగి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పెట్టారు. చీప్ లిక్కర్ క్వార్టర్ (180 ఎంఎల్) రూ.99కే విక్రయిస్తామని ప్రకటించింది. తక్కిన బ్రాండ్లన్నీ ఎమ్మార్పీకే విక్రయించాలి. అయితే ప్రభుత్వం టీడీపీ నేతలకు అనధికారికంగా మద్యం వ్యాపారంపై కొన్ని సూచనలు చేసినట్లు తెలుస్తోంది. 'మద్యం వ్యాపారం ద్వారా టీడీపీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు లాభం కలగాలి. అందరూ సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలు దక్కించుకోండి. జనసేన, బీజేపీ నుంచి ఇబ్బందులు లేకుండా వారిని కూడా ఒకరిద్దరిని కలుపుకోండి. ఇతర పార్టీల వారు, రాజకీయాలకు సంబంధం లేని వారు దరఖాస్తులు వేయకుండా చూసుకోండి. ఎవరైనా సిండికేట్‌ను కాదని దరఖాస్తు చేస్తే వ్యాపారం చేయలేరని బెదిరించండి. మద్యం దుకాణం నడిపేందుకు సవాలక్ష నిబంధనలు ఉన్నాయి. 'సిండికేట్'ను కాదని షాపు దక్కించుకుంటే అధికారులకు నిబంధనలను అమలు చేసి దుకాణం మూసేలా చేద్దాం! ఎక్సైజ్ అధికారులు మీకు పూర్తిగా సహకరిస్తారు. ఆ దిశగా వారికి ఆదేశాలు అందాయి. మరో విషయం! సిండికేట్‌లో ఇద్దరు, ముగ్గురు మాత్రమే పెట్టుబడి పెట్టి లాభం మొత్తం వారే తీసుకుంటారు అంటే కుదరదు. వీలైనంత ఎక్కువ మందిని పెట్టుకుని ఒక్కొక్కరికి నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష లాభం వచ్చేలా కలవండి. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించుకుని టీడీపీ కార్యకర్తలకు మేలు జరిగేలా చూడండి' అని ప్రభుత్వంలోని ముగ్గురు కీలక వ్యక్తులు తమ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఏడాదికి మద్యం వ్యాపారులకు అదనపు ఆదాయం ఇలా..

ఒక్కో దుకాణంలో సగటున విక్రయించే మద్యం బాటిళ్లు 620	ఒక్కో బాటిల్‌పై వచ్చే లాభం 20 శాతం	రూ.20 అదనంగా విక్రయిస్తే ఒక్కో దుకాణానికి రూ.89.28 లక్షలు
కర్నూలు జిల్లాలో 99 దుకాణాదారులకు : రూ.88.38 కోట్లు	నంద్యాల జిల్లాలో 105 దుకాణదారులకు: రూ.93.74 కోట్లు	

వ్యాపారులకు ఆదాయం.. అధికారులకు మామూళ్లు

రెండు జిల్లాలలో 204 మద్యం దుకాణాలు ఉన్నాయి. మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ అధికారుల లెక్క ప్రకారం ఒక్కో దుకాణంలో రోజూ సగటున 620 బాటిళ్లు విక్రయిస్తారు. వీటి ఎమ్మార్పీపై 20 శాతం ఆదాయం ఉంటుంది. ఈ లెక్కన వ్యాపారులకు ఏడాదికి రూ.90 లక్షల నుంచి రూ. కోటి ఆదాయం వస్తుంది. అయితే ఇది కాకుండా ఒక్కో బాటిల్‌పై రూ.20–రూ.30 అదనంగా విక్రయించేలా 'వయొలేషన్' చేయనున్నారు. దీనికి కూటమి పెద్దల నుంచి కూడా సానుకూలత ఉండటంతో ఎక్సైజ్, సివిల్ పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తారు. దీని ద్వారా ఒక్కో దుకాణానికి రోజుకు రూ.12,400 నుంచి రూ.18,600 అదనంగా ఆదాయం వస్తుంది. అంటే నెలకు రూ. 3.72లక్షల నుంచి రూ.5.58 లక్షలు చొప్పున ఏడాదికి రూ.44.64 లక్షల నుంచి రూ.66.96 లక్షల అదనపు ఆదాయం వస్తుంది. బాటిళ్లు అధికంగా విక్రయిస్తే మరింత ఆదాయం వస్తుంది. ఎమ్మార్పీ ద్వారా వచ్చే ఆదాయానికి ఇది అదనం. అంటే ఏడాదికి ఒక్కో దుకాణం ద్వారా ఎమ్మార్పీ ఆదాయంతో కలిపితే రూ.1.50 కోట్లు ఆదాయం వస్తుంది. రెండేళ్లలో రూ.3కోట్ల వరకూ ఆదాయం చూస్తారు. ఒక్కో దుకాణంలో 10 మంది భాగస్వాములుగా ఉన్నా ఒక్కొక్కరికి రూ.30 లక్షలు ఆదాయం వస్తుంది. వయొలేషన్ జరిగితే తమకు నెల మామూళ్లు వస్తాయనే ఆశతో ఎక్సైజ్, సివిల్ పోలీసులు ఉన్నారు. దుకాణాలు ప్రారంభం కాగానే వీరికి నెలమామూళ్లు ఫిక్స్ చేయనున్నారు. ఏది ఏమైనా 'కూటమి నేతల'కు మద్యం వ్యాపారం కాసుల పంట పండించనుంది.

ఎవరి దారి వారిదే!:

టీడీపీ నుంచి ఉన్న సూచనల ప్రకారం సిండికేట్‌ను నడిపించేందుకు కొందరు ఆసక్తి చూపలేదు. ఎక్కువ మందిని కలుపుకుని లాభం పంచేందుకు ఇష్టపడటం లేదు. కర్నూలులో గతంలో మాజీ మంత్రి సోదరుడు సిండికేట్ నడిపారు. ఇప్పుడు అతను కూడా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఓ ప్రజాప్రతినిధి భర్త సిండికేట్‌ను తన గుప్పిట్లోకి తీసుకోవాలనే యోచనలో ఉన్నారు. అయితే ఇప్పటి వరకూ 'సిండికేట్' సమావేశం జరగకపోవడంతో ప్రస్తుతానికి ఒక్కో దుకాణానికి 20–30 మంది గ్రూపుగా ఏర్పడి దుకాణాలు దక్కించుకోవాలనే యోచనలో ఉన్నారు. ఆదోనిలో ఓ మాజీ ఎమ్మెల్యే కుమారుడు, నంద్యాలలో ఓ కీలక ప్రజాప్రతినిధి కుమారుడు, ఓ మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు సిండికేట్‌ను నడిపించేందుకు సిద్ధమయ్యారు. డోన్, పత్తికొండ, బనగానపల్లి, ఆలూరు, ఎమ్మిగనూరులో కూడా అక్కడి ప్రజాప్రతినిధుల కీలక అనుచరుల ఆధ్వర్యంలో 'సిండికేట్' నడిచేలా చర్యలు తీసుకుంటున్నారు.

న్యూస్‌రీల్

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ

కర్నూలు: మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఆర్ పోలీస్ విభాగం దగ్గర బుధవారం గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరంలో గాంధీ అనుసరించిన అహింసావాదం, ఆలోచనలు, సిద్ధాంతాలను స్మరించుకుంటూ విధుల్లో పునరంకితమవుదామని పిలుపునిస్తూ గ్రామాల అభివృద్ధి, సమైక్య భావాన్ని గుర్తు చేసుకున్నారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు ప్రసాద్, గుణశేఖర్‌బాబు, శేషయ్య, ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, జావేద్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

కర్నూలు సిటీ: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచి శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు ఆ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్ తెలిపారు. బుధవారం నగరంలోని ఓ స్కూల్‌లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఆధారిత పరీక్షకు పెద్ద ఎత్తున స్పందన వచ్చిందన్నారు. స్కూల్ స్థాయిలో 1500 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఈ నెల 1వ తేదీన మండల స్థాయి పరీక్ష సైతం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు సుధీర్, సమత కార్యదర్శి రమాదేవి, కల్లూరు మండల కార్యదర్శి అజాద్, ధనుష్, విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారిగా భాస్కర్

కర్నూలు(అర్బన్): జిల్లా పంచాయతీ అధికారిగా జీ భాస్కర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ డీపీఓగా విధులు నిర్వహించిన టీ నాగరాజునాయుడు అనంతపురం జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో బుధవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు. నూతన డీపీఓగా నియమితులైన భాస్కర్ ఈ నెల 3వ తేదీన గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. 2007 గ్రూప్–1 బ్యాచ్‌కు చెందిన ఈయన 2007 నుంచి 2014 వరకు ప్రకాశం జిల్లాలో ఎంపీడీఓగా, 2014 నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వెలుగోడు, నంద్యాల, గోస్పాడు మండలాల్లో ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కర్నూలు డ్వామాలో డీవీఓగా విధులు నిర్వహిస్తున్న ఈయనను డీపీఓగా నియమిస్తూ పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ క్రిష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉల్లి నాణ్యతను బట్టి ధర కోట్ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లిగడ్డల నాణ్యతా ప్రమాణాలను బట్టి ధర కోట్ చేయాలని కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీ ఆర్.జయలక్ష్మి వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెరుగకుండా నిరోధిస్తున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో బుధవారం మార్కెట్ యార్డులోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ.... ఉల్లికొనుగోలు మార్కెట్ కమిటీ నుంచి లైసెన్స్ పొందిన వ్యాపారులందరూ బిడ్డింగ్‌లో పాల్గొనాలన్నారు. సిండికేట్‌గా మారి రైతులను నష్టపరిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు పొలంలోనే ఉల్లిగడ్డలను శుభ్రం చేయడంతో పాటు గ్రేడింగ్ చేసుకొని తెస్తే గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందని, ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అసిస్టెంటు సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు వ్యాపారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 9000 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. ఈ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 2,220, మద్రాస్ కాలువకు 5,000, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు వదిలినట్లు వెల్లడించారు.

టెట్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఈనెల 21 వరకు రెండు సెషన్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష
- జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు, తెలంగాణలో రెండు కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 54,083 మంది అభ్యర్థులు
- హాల్ టికెట్, గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాల్సిందే



బిట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు నరసింహరావు

కర్నూలు సిటీ: టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) నేటి నుంచి మొదలుకానుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 6 కేంద్రాల్లో, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎనిమిది కేంద్రాల్లో 54,083 మంది పరీక్ష రాయనున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు ప్రతి రోజు రెండు సెషన్లలో టెట్ నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు మరో సెషన్ ఉంటుంది. కాగా జిల్లాలో ఏర్పాటు చేసిన టెట్ కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు నరసింహారావు బుధవారం పరిశీలించారు.

గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి

ఉపాధ్యాయ అర్హత పరీక్షకు జిల్లాలో 6 కేంద్రాలను కేటాయించారు. కర్నూలు నగరంలో నాలుగు, ఎమ్మిగనూరులో ఒకటి, ఆదోనిలో మరొకటి, హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు కేటాయించారు. ఇందులో ఐయాన్ డిజిటల్ జోన్ దూపాడులో 7,401 మంది, ఐయాన్ డిజిటల్ సనత్‌నగర్‌లో 20,265 మంది, భీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఆదోనిలో 3,100 మంది, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, కర్నూలులో 7,317 మంది, సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ, ఎమ్మిగనూరులో 900 మంది, బృందావన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, పెద్దటేకూరులో 1,668 మంది, ఐయాన్ డిజిటల్ జోన్ కర్మాన్‌ఘాట్, హైదరాబాద్‌లో 4,843 మంది, ఐయాన్ డిజిటల్ జోన్ ఎల్‌బీ నగర్ హైదరాబాద్‌లో 8,580 మంది టెట్‌కు హాజరుకానున్నారు. కాగా నిర్దేశిత సమయానికి గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష రాసే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తెచ్చుకోకూడదని హాల్ టికెట్, గుర్తింపు కార్డు, పెన్ను మాత్రమే వెంట ఉండాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు అదనపు సమయం కేటాయించారు. అలాగే హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు ఉంటే అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోని డిపార్ట్‌మెంటు అధికారి దృష్టికి ఆధారాలతో తీసుకెళ్లి సరి చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇదిలా ఉంటే టెట్ దరఖాస్తు సమయంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న కేంద్రాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఇతర ప్రాంతాల్లోని కేంద్రాలు కేటాయించడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి టీజీ భరత్, మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ రంజిత్‌బాషా, ప్రజాప్రతినిధులు, అధికారులు

కర్నూలు(సెంట్రల్): మహాత్మాగాంధీ ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖమంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ నాగరాజు, కలెక్టర్ రంజిత్‌బాషా, మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...అహింసా అనే ఆయుధంతో గాంధీజీ దేశానికి స్వాతంత్రాన్ని సంపాదించిపెట్టారన్నారు. ఈ సందర్భంగా మాంటిస్సోరి పాఠశాల విద్యార్థుల గాంధీ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్వో చిరంజీవి, సీపీఓ హిమ ప్రభాకరరాజు, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.80 లక్షల కుంభకోణంపై విచారణ కమిటీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆత్మకూరు బ్రాంచీలో జరిగిన రూ.80 లక్షల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గీత ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలో చీఫ్ మేనేజర్ సహేరాబాను, ఐటీ మేనేజర్ అంజుమ్ మరో ఇద్దరు ఉన్నారు. కుంభకోణం ఎలా జరిగింది.... ఇందులో ఎవ్వరెవరి ప్రమేయం ఉంది? ఎంత మొత్తం నిధులను మళ్లించారు? నిధులు ఎక్కడికి వెళ్లాయనే దానిపై కమిటీ విచారణ జరుపుతుంది. నివేదికను కమిటీ సీఈవోకు అందజేయనుంది. కాగా మరోవైపు డీసీసీబీ సీఈవో విజయకుమార్, నంద్యాల రీజనల్ మేనేజర్ శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్‌తో కూడిన బృందం కూడా ఆత్మకూరుకు వెళ్లి కుంభకోణంపై విచారణ చేయనుంది.

వాహనం విరాళం



వాహన తాళం ఈఓకు అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు అశోక్ లైలాండ్ ట్రక్కు వాహనాన్ని విరాళంగా సమర్పించారు. బుధవారం గంగాధర మండపం వద్ద ఎస్‌బీఐ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాణా అసుతోష్‌కుమార్ సింగ్ సంబంధించిన పత్రాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజుకు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్‌మేనేజర్ సంజయ్‌కుమార్, డి.వి.ఎం.దినేష్‌గులాటి, రీజనల్ మేనేజర్ ఎంవి.సూర్యప్రకాష్, హెచ్.ఆర్.మేనేజర్ కేశవ, శ్రీశైలం బ్రాంచ్‌మేనేజర్ భగవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో 194 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రానికి 194.3096 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 45,181 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. మంగళవారం నుంచి బుధవారం వరకు జలాశయానికి ఎగువ ప్రాజెక్టుల నుంచి 90,155 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దిగువ ప్రాంతాలకు 59,700 క్యూసెక్కుల నీరు విడుదలయ్యింది. కుడిగట్టు కేంద్రంలో 4.408 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.327 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 881.20 అడుగులకు చేరుకుంది.

ఉత్సవాలకు వేళాయె!

- శ్రీగిరిలో నేటి నుంచి దేవీశరన్నవరాత్రోత్సవాలు
- యాగశాల ప్రవేశంతో ఉత్సవాలకు అంకురార్పణ
- మొదటిరోజు శ్రీశైల భ్రామరీకి శైలపుత్రి అలంకారం
- భృంగివాహనంపై విహరించనున్న స్వామి అమ్మవార్లు



శ్రీశైల ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలకు శ్రీశైలమల్లన్న క్షేత్రం ముస్తాబైంది. నేటి నుంచి ఈ నెల 12వ తేది వరకు అత్యంత వైభవంగా ఈ వేడుకలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో భ్రమరాంబాదేవికి నవదుర్గ అలంకారాలు, ప్రత్యేక నవావరణపూజలు, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, చండీయాగం, రుద్రయాగం చేయనున్నారు.

నేడు ఉత్సవాలకు అంకుర్పాణ

దసరా మహోత్సవాలకు నాందిగా గురువారం ఉదయం 8గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి, గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనము, దీక్షాసంకల్పం, కంకణపూజ, రుత్విగ్వరణం, కంకణపూజ, కంకణధారణ జరిపిస్తారు. అఖండస్థాపన, వాస్తుపూజ, వాస్తు హోమం, నవగ్రహ మండపారాధన, చండీకలశ స్థాపనము, చతుర్వేద పారాయణలు, విశేష కుంకుమార్చనలు, గణపతి పంచాక్షరీ, కుంకుమార్చనలు, కుమారి పూజలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటలకు స్వామి వారి యాగశాలలో యాగశాల ప్రవేశం చేసి వేద స్వస్తి, శివసంకల్పం, గణపతిపూజ, అఖండ దీప స్థాపన, వాస్తుపూజ, మండపారాధనలు, రుద్రకలశ స్థాపన, స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నకాలార్చనలు, మహా నివేదనలు జరిపిస్తారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, రుద్ర హోమం, అమ్మవారికి నవావరణార్చన, కుంకుమార్చనలు చేస్తారు.

తొలి రోజు శైలపుత్రి అలంకారం

దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం శ్రీశైల భ్రమరాంబాదేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అలాగే స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను భృంగివాహనంపై విహరిస్తారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు.

ఫోరెన్సిక్ విభాగ వైద్యుల ప్రతిభ



డాక్టర్ సాయిసుధీర్, పీజీ వైద్యులను అభినందిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కాకినాడలో ఇటీవల జరిగిన దక్షిణ భారత భారతదేశ న్యాయ వైద్య సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజి ఫోరెన్సిక్ వైద్యులు ప్రతిభ చూపారు. 'మరణం తర్వాత భద్రపరిచి, తిరిగి బతికించడం' అనే అంశంపై ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ సాయిసుధీర్ ఉపన్యాసం ఇచ్చారు. ఆయనతో పాటు పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో పీజీ విద్యార్థులు డాక్టర్ మహమ్మద్ అలీ, డాక్టర్ కార్తీక్‌లు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. బుధవారం వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ అభినందించారు.

ఉమ్మడి జిల్లాలో 4,982 మంది పింఛన్లకు దూరం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,982 మంది ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ తీసుకోలేదు. అక్టోబరు నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం వరుసగా రెండవ రోజు కూడా జరిగింది. అయితే, బుధవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క సచివాలయ ఉద్యోగి కూడా ఇంటికి వెళ్లి పింఛన్ అందచేసిన దాఖలాలు లేవు. ఇంటిదగ్గరే పంపిణీ చేస్తున్నామని హడావుడి చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం పరిమితంగానే జరుగుతోంది. కర్నూలు జిల్లాలో 2,41,843 పింఛన్‌దారులుండగా బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,39,742 (99.13 శాతం) మందికి అందజేశారు. 2,101 మంది పింఛను పొందలేదు. అలాగే నంద్యాల జిల్లాలో మొత్తం 2,18,225 మంది పింఛనుదారులుండగా 2,15,344 (98.68 శాతం)మందికి అందజేశారు. జిల్లాలో 2,881 మంది పింఛన్లు పొందలేదు. పంపిణీ రెండురోజులకే పరిమితం చేయడం వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 4,982 మంది పింఛను పొందలేకపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలువగా, నంద్యాల జిల్లా 12వ స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


సుబ్బరత్నమ్మ (ఫైల్)

దొర్నిపాడు: మండలానికి చెందిన సుబ్బరత్నమ్మ(38)అనే వివాహిత అదృశ్యమైంది. ఈమె కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ పుట్టింటిలోనే ఉంటుంది. సెప్టెంబర్ 30వ తేదీన మందుల కోసం అంటూ కర్నూలు వెళ్లింది. రాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కంగారు పడ్డ కుటుంబీకులు బంధువులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించారు. సుబ్బరత్నమ్మ తల్లి బత్తుల లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రతాపరెడ్డి తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని గుడిపాటి వీధికి చెందిన సాయిమనోహర్ హత్యకేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే దీనికి కారణమని తేలింది. బుధవారం సీఐ సుధాకర్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుడిపాటి వీధికి చెందిన దుర్గాప్రసాద్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన భార్యతో అదే వీధికి చెందిన సాయిమనోహర్ కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న నిందితుడు దుర్గాప్రసాద్ ఎలాగైనా సాయిమనోహర్‌ను అంతం చేయాలనుకున్నాడు. ఈ క్రమంలోనే గత నెల 30వ తేది రాత్రి తన భార్యతో హతుడు కలిసి ఉండగా పట్టుకుని కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ప్రమాదవశాత్తు మహిళ మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని బావిపల్లి సమీపంలో బోయ ఈరమ్మ (50) అనే మహిళ ప్రమాదవశాత్తు మృతి చెందింది. కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన ఈమె నాలుగు రోజుల క్రితం బావిపల్లి సమీపంలోని బంగారమ్మ గుట్టకు వచ్చింది. అక్కడికి వజ్రాలు వెతికేందుకు వివిధ ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. ఇదే పని మీద వచ్చిన ఈరమ్మ మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు రాళ్లపై జారిపడింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న జలదుర్గం ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో డీసీఎం వ్యాను దగ్ధం


కాలిపోయిన బైక్‌లు, వస్తువులు

కృష్ణగిరి: జాతీయ రహదారిలోని అమకతాడు టోల్‌గేట్ సమీపంలో బుధవారం వేకువజామున డీసీఎం వ్యాను షార్ట్‌సర్క్యూట్‌కు గురైంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఇంటి సామాగ్రితో వెళుతున్న వ్యాను టోల్‌గేట్ సమీపానికి రాగానే షార్ట్‌సర్క్యూట్‌కు గురై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ససిగేటి ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వస్తువులు, మూడు బైక్‌లు, ఇంటి సామాగ్రి కాలి పోయాయి. విషయం తెలుసుకున్న డోన్ ఫైర్‌స్టేషన్ అధికారి రంగస్వామి అక్కడికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. దాదాపు రూ.8 లక్షల దాకా ఆస్తి నష్టం వాటిల్లినట్లు లారీ యజమాని సందీప్‌కుమార్ వాపోయారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఫైర్ స్టేషన్ అధికారి తెలిపారు.

ఏపీఎస్పీ రెండో పటాలంలో బదిలీలలు

- 'పెద్ద' తలకు కాసుల వర్షం
- చక్రం తిప్పిన ఆర్ఐ, హెచ్‌సీ



ఏపీఎస్పీ రెండో పటాలం పరిపాలనా కార్యాలయం

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో బదిలీలు ఆ శాఖలోని పెద్ద తలకు కాసుల వర్షం కురిపించాయి. కొందరు రూ.20 వేల నుంచి రూ.50 వేలు కుమ్మరించి కోరుకున్న పోస్టింగులు దక్కించుకున్నారు. కమాండెంట్ రవిశంకర్ గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందారు. ముందు రోజు 11 మంది ఏఆర్ఎస్ఐలు, 25 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 64 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే బదిలీల వ్యవహారంలో ధన ప్రవాహం కీలకంగా పనిచేసిందని కొందరు సిబ్బంది ఆరోపిస్తున్నారు. బెటాలియన్‌లో పనిచేస్తున్న ఒక ఆర్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్ ఈ బదిలీల వ్యవహారంలో చక్రం తిప్పి భారీగా వసూలు చేశారన్న చర్చ జరుగుతోంది. సిబ్బంది అవసరాలను అవకాశంగా మలుచుకుని ఎక్కడా రాజీ లేకుండానే ముక్కు పిండి వసూలు చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. వివిధ హోదాల్లో ఉన్న వంద మందికి స్థానచలనం కలుగగా కోరుకున్న స్థానాల్లో పోస్టింగులు ఇవ్వడం వెనుక రూ.లక్షలు చేతులు మారాయి.

స్టోర్ ఎన్‌సీఓ, కంపెనీ మేనేజర్ పోస్టులకు రూ.50 వేలు

నిబంధనల ప్రకారం ఆయా పోస్టుల్లో విధులు నిర్వహించాలంటే అందుకు సంబంధించిన శిక్షణ పొంది ఉండాలి. గతంలో అదే విధులు చేసిన వారికి మళ్లీ నియమించకూడదన్న నిబంధన ఉంది. అయితే కొందరిని రెండోసారి కూడా ఆయా పోస్టుల్లో నియమించారు. పటాలంలోని క్యాంటీన్‌లో పనిచేసే వర్కర్ కూతురిపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న హెడ్ కానిస్టేబుల్‌ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అప్పట్లో జి-కంపెనీకి బదిలీ చేశారు. అయితే ఇప్పుడు ఆయన్ను హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేయడంపై సిబ్బంది తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఒక ఆర్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్ ఈ బదిలీల వ్యవహారంలో చక్రం తిప్పి బయటి కంపెనీల నుంచి హెడ్ క్వార్టర్‌కు వచ్చిన ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల దాకా వసూలు చేసినట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. ఒక్కొక్క కంపెనీలో వంద మందికి పైగా సిబ్బంది ఉంటారు. పటాలంలో 9 కంపెనీలు ఉన్నాయి. అలాగే హెడ్ క్వార్టర్‌లో ఎంటీ గ్రూప్, క్వార్టర్స్ గ్రూప్, మాస్టర్ గ్రూప్, బ్యాండ్ గ్రూప్, బిడబ్ల్యూ గ్రూప్‌లలో 200 మంది దాకా సిబ్బంది ఉంటారు. మొత్తం పటాలంలో దాదాపు 1100 మంది సిబ్బంది ఉంటారు. టర్న్ ప్రకారం ప్రతి ఒక్కరినీ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహించే అవకాశం కల్పించాలి. అయితే ఏళ్ల తరబడి బయటి కంపెనీల్లో ఉన్న వారికి స్థానచలనం కలిగినప్పటికీ మామూళ్లు ముట్టజెప్పిన వారికి మాత్రమే హెడ్ క్వార్టర్‌కు నియమించారు. ఒక హెడ్ కానిస్టేబుల్ జి-కంపెనీలో పనిచేస్తుండగా ప్రస్తుతం స్టోర్ ఎన్‌సీఓగా నియమించారు. నచ్చిన చోటుకు పంపేందుకు ఉన్న చోటనే ఉంచేందుకు కూడా ఉద్యోగుల నుంచి భారీగా దండుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారి పదవీ విరమణకు ఒక రోజు ముందు బదిలీల పేరుతో ఇద్దరు అధికారులు చక్రం తిప్పి వసూలు చేసినట్లు చర్చ జరుగుతోంది. ఒక హెడ్ కానిస్టేబుల్ గతంలో స్టోర్ ఎన్‌సీఓగా పనిచేశాడు. ప్రస్తుతం ఔట్ డ్యూటీ నుంచి మళ్లీ హెడ్ క్వార్టర్‌కు నియమించారు. అలాగే మరో ఉద్యోగి గతంలో శిక్షణ కేంద్రం (డీటీసీ) హెచ్‌సీగా కొన్నేళ్ల పాటు పనిచేశాడు. మళ్లీ హెడ్ క్వార్టర్‌కు నియమించారు. హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహించిన మరో హెడ్ కానిస్టేబుల్‌కు సి-కంపెనీకి బదిలీ చేశారు. ఆయన నుంచి మామూళ్లు దండుకుని అటాచ్ పేరుతో డీటీసీకి బదిలీ చేశారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరినీ ఏడాదికోసారి వేరే కంపెనీకి బదిలీ చేయాలన్న నిబంధన ఉంది. ఓ హెడ్ కానిస్టేబుల్ ఐదేళ్లుగా హెడ్ క్వార్టర్‌లోనే పనిచేస్తున్నాడు. మళ్లీ ఆయన్ను క్యాంటీన్ నిర్వహణ విధులకు నియమించారు. నిబంధనలు పట్టించుకోకుండా డబ్బులు కురిపించిన వారికే కోరుకున్న స్థానాల్లో నియమించారు. బదిలీల వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ఏళ్ల తరబడి బయటి కంపెనీల్లో పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

పటాలంలో పనిచేసే సిబ్బందికి టర్న్ ప్రకారం హెడ్ క్వార్టర్ విధులకు అవకాశం కల్పించాలి. పటాలంలో ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్‌తో పాటు హెడ్ క్వార్టర్ కలిపి 9 కంపెనీలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఏళ్ల తరబడి బయటి కంపెనీల్లో పనిచేసిన వారిని హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేయాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా బదిలీలు జరిగాయి. గతంలో హెడ్ క్వార్టర్ విధులు చేయని వారికి అవకాశం కల్పించాలి. స్టాఫ్ పోస్టు, స్టోర్ ఎన్‌సీఓ కంపెనీ మేనేజర్ పోస్టులకు ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు చేసినట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. ప్రతి కంపెనీలో ఒక మేనేజర్, స్టోర్ ఎన్‌సీఓ ఉంటాడు. ఆయా పోస్టులకు సిబ్బంది పోటీ పడటంతో ముడుపులు దండుకుని వారు కోరుకున్న స్థానాల్లో నియమించినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు.

గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి


మహాత్మాగాంధీ చిత్రపటానికి గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: నేటి యువత మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుని శాంతి మార్గంలో నడవాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఎస్పీ తన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జాతిపిత అహింసా మార్గంలో సత్యాగ్రహమే ఆయుధంగా పోరాడి తెల్లదొరలను తరిమికొట్టి దేశానికి స్వేచ్ఛను తీసుకువచ్చారన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ముందు మనం మారి చూపాలన్న ఆయన నినాదాన్ని ప్రతి ఒక్కరు తప్పకుండా అనుసరించాలన్నారు. అలాగే దేశం పట్ల భక్తి, గౌరవం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు ఇస్మాయిల్, సూర్యమౌళి, సుధాకర్‌రెడ్డి, ఇస్రార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

డోన్ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తుండగా మండలంలోని దేవరబండ గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. దేవరబండ గ్రామానికి చెందిన ఈడిగ రవి, ఈడిగ మధుశంకర్‌గౌడ్, యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నడిపి హుసేన్‌పీరా, షేక్ సాధిక్ బాషా కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న డోన్ రూరల్ పోలీసులు బుధవారం దేవరబండ గ్రామం వద్ద తనిఖీలు చేపట్టి పై నిందితుల నుంచి 2,112 టెట్రా ప్యాకెట్లతో పాటు ఒక స్కార్పియో వాహనం, టీవీఎస్ ఎక్సెల్ బైక్‌ను సీజ్ చేశారు. పట్టుబడిన నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాస్ విలేకరులకు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తుగ్గలి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బొల్లవానిపల్లికి చెందిన సోమశేఖరరెడ్డి (65) ద్విచక్ర వాహనంపై పత్తికొండ నుంచి స్వగ్రామానికి వస్తుండగా గుత్తి నుంచి పత్తికొండకు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమశేఖర రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బంధువులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తుగ్గలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్రిసభ్య కమిటీ ఏర్పాటు

నంద్యాల(అర్బన్): శ్రీనివాస సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ సొసైటీకి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందని సంఘం డిప్యూటీ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేది వరకు ఈ కమిటీ ద్వారానే సొసైటీ లావాదేవీలు జరుగుతాయని వెల్లడించారు. ఇందులో సభ్యులుగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాములు, వెంకటసుబ్బయ్యలతో పాటు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఉంటారన్నారు.

వైస్‌చాన్స్‌లర్ పోస్టులకు భారీగా దరఖాస్తులు


రాయలసీమ విశ్వవిద్యాలయం

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్ పోస్టులకు భారీగా దరఖాస్తులొచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ప్రభుత్వ హయాంలో నియమితులైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులను రాజీనామాలు చేయించారు. దీంతో ఖాళీ అయిన 17 వర్సిటీల వైస్‌చాన్స్‌లర్ల పోస్టుల భర్తీకి సర్కారు కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చింది. గత నెల చివరితో ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగిసింది. కొందరు ప్రొఫెసర్లు రెండు మూడు వర్సిటీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత విద్యా మండలి దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయనుంది. దీంతో పాటే ప్రతి వర్సిటీకి వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ నియామకం జరిగితే కానీ స్క్రీనింగ్, సెర్చ్ కమిటీల ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగదని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. రాయలసీమ యూనివర్సిటీకి సుమారు 160 దరఖాస్తులు, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీకి 60 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

చంద్రబాబు క్షమాపణ చెప్పాల్సిందే


పత్తికొండలో మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

పత్తికొండ(తుగ్గలి): ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, దీనిపై వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, వర్గసభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కూటమి ప్రభుత్వం పింఛన్ తప్ప మిగతావేవీ అమలు చేసింది లేదన్నారు. అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనం అని పేరు మార్చడం తప్ప ఇంతవరకూ పథకం ఊసే లేదని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని చెప్పారని, అయితే ఖరీఫ్ సీజన్ ముగిసినా 20 రూపాయలు కూడా ఇచ్చింది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆడబిడ్డ నిధి ఎప్పటినుంచి ఇస్తారని ప్రశ్నించారు. దేశంలోనే సీనియర్ నేతగా చెప్పుకునే చంద్రబాబు ప్రజల సమస్యలు, వరదలు, అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితులను పక్కనబెట్టి ప్రజలను డైవర్ట్ చేసేందుకు తిరుపతి లడ్డూ కల్తీ అంటూ తప్పుడు ఆరోపణలను తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, నివేదిక రాకుండానే బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సీఎం వ్యాఖ్యలు చేయడంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ విషయమై సుప్రీం కోర్టు సైతం మొట్టికాయలు వేసిందని చెప్పారు. తహసీల్దార్ స్థాయిలో ఇచ్చే వాటి కోసం కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక గ్రామానికి వచ్చి తాను ప్రజలకు వరాలు ఇచ్చానని గొప్పలు చెప్పుకోవడం ఏమిటని యద్దేవా చేశారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలని కోరారు. ఇప్పటికైనా సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు, నియోజకవర్గంలోని 106 చెరువులకు నీటిని మళ్లించాలని, టమాట జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ నాయకులు రాజాసాహెబ్, రామాంజినేయులు, సుల్తాన్, కారన్న, సురేంద్రకుమార్, పెద్ద ఈరన్న పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నీ


ఫుట్‌బాల్ టోర్నీ విజేతలతో అతిథులు, నిర్వాహకులు

కర్నూలు (టౌన్): నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్ఈ క్లస్టర్-7 ఫుట్‌బాల్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. హోరాహోరీగా సాగిన పోటీల్లో అండర్-19 విభాగంలో హైదరాబాద్ మెలూహా పాఠశాల జట్టు 5-3 గోల్స్‌తో ఆర్మీ పబ్లిక్ స్కూల్‌పై విజయం సాధించింది. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మూడవ స్థానంలో నిలిచింది. అండర్-17 విభాగంలో హైదరాబాద్ రాక్‌విల్ ఇంటర్నేషనల్ స్కూల్ విన్నర్స్‌గా, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రన్నర్స్‌గా, గండిపేటకు చెందిన బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ మూడో స్థానంలో నిలిచాయి. అండర్-14 విభాగంలో హైదరాబాద్ రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ విన్నర్స్‌గా, విజయవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రన్నర్స్‌గా, మూడవ స్థానంలో గండిపేట బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ నిలిచాయి. అంతకుముందు పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించగా టోర్నీ ముగింపు కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లతో సమయాన్ని వృథా చేయకుండా చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు పుల్లయ్య, చైర్మన్ మోహన్‌కుమార్ మాట్లాడారు. పాఠశాల సమన్వయకర్త సౌమ్య, గోపీనాథ్, టోర్నమెంట్ కార్యదర్శి రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్‌కమల్ పాల్గొన్నారు. అనంతరం విజయం సాధించిన క్రీడా జట్లకు అతిథులు ట్రోఫీలు, క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఎద్దుల బండి బోల్తా..మహిళ మృతి


మృతిచెందిన ముంతాజ్ (ఫైల్)

కొత్తపల్లి: ఎద్దుల బండి బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ కూలీ మృతిచెందింది. బుధవారం దుద్యాల గ్రామ పొలిమేరలో ఈ సంఘటన జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. దుద్యాలకు చెందిన షేక్ ముంతాజ్(38), షేక్ రసూల్ దంపతులు వ్యవసాయ పనులకెళ్లి జీవనం సాగిస్తుంటారు. రోజులాగే ముంతాజ్ బుధవారం పొలం పనికి వెళ్లింది. సాయంత్రం 10 మంది తోటి కూలీలతో కలిసి ఎద్దుల బండిపై తిరిగి వస్తుండగా దుద్యాల నుంచి కరివేన వెళ్లే పాత బండ్ల రస్తాలో భవనాశి వాగు వద్ద అదుపుతప్పి బండి బోల్తా పడింది. ఈ ఘటనలో ముంతాజ్ అక్కడికక్కడే మృతిచెందగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి షేక్షా, మస్తాన్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద విషయం తెలియగానే ఎస్ఐ ఎం.కేశవ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్య

బొమ్మల సత్రం: మద్యం సేవించేందుకు తల్లి డబ్బు ఇవ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణంలోని గిరినాథ్ సర్కిల్‌లో నివాసముంటున్న తేజరావు (22) స్థానిక చికెన్ సెంటర్‌లో పనిచేస్తాడు. తండ్రి అనారోగ్యంతో మృతి చెందటంతో తల్లి శాంతబాయితో కలిసి ఉంటున్నాడు. అయితే, కొద్ది రోజులుగా తేజరావు మద్యానికి బానిసై పనికి వెళ్లటం మానేశాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం తాగేందుకు తల్లిని డబ్బులు ఇవ్వమని అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతసేపటికి గుర్తించిన తల్లి పోలీసులకు సమాచారం అందించింది. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మంచం పట్టిన సున్నిపెంట


ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న రోగులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో విషజ్వరాలు విజృంభించాయి. వందలాది మంది జ్వరంతో బాధపడుతూ మంచం పట్టారు. చికిత్స కోసం కొందరు ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదిస్తుంటే మరికొందరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు పెరగడం, పరిశుభ్రత లోపించడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీనికితోడు డ్యాంలో నిల్వ ఉన్న కలుషిత నీటిని సున్నిపెంట ఫిల్టర్ హౌస్‌లో సరి అయిన క్లోరినేషన్, ఫిల్టరేషన్ జరపకుండా నేరుగా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఇలా వివిధ కారణాలతో వందలాది మంది అనారోగ్యానికి గురవుతున్నారు. పదిరోజుల్లోనే స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఓపీకి జ్వరాలతో 1500 మంది వరకు వచ్చినట్లు డాక్టర్లు చెబుతున్నారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న వారిని ఆసుపత్రిలోనే చేర్పించుకుని చికిత్స అందిస్తున్నట్లు సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మహేశ్వరరెడ్డి తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి


మృతిచెందిన మహేశ్వరరెడ్డి

చాగలమర్రి: మండలంలోని చిన్నబోదనం గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. చాగలమర్రి ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పాపిరెడ్డి గారి మహేశ్వరరెడ్డి (28) మొక్కజొన్న పంట సాగు చేశాడు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. శరీరంపై గాయాలు ఉండటంతో తండ్రి రాజేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. బుధవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

కేసీలో మహిళ మృతదేహం లభ్యం


కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న మహిళ మృతదేహం

కర్నూలు: కేసీ కెనాల్‌లో మహిళ మృతదేహాన్ని కిమ్స్ హాస్పిటల్ దగ్గర స్థానికులు వెలికితీశారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో కర్నూలు అశోక్ నగర్ వైపు నుంచి కిందికి కొట్టుకుని వెళ్తుండగా వినాయక్‌ఘాట్ వద్ద కొంతమంది యువకులు గుర్తించి వెలికితీసేందుకు ప్రయత్నించారు. అయితే, నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో వారికి కూడా మృతదేహం దొరక్కుండా కిందికి కొట్టుకుపోయింది. మృతదేహం ఉబ్బిపోయి గుర్తు పట్టని విధంగా ఉంది. కిమ్స్ హాస్పిటల్ సమీపంలోని కాలనీవాసులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు కొంతమంది నీటిలోకి దిగి వెలికితీశారు. తర్వాత అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వివరాలు సేకరిస్తున్నారు.

కూలి పనికి వచ్చి మృత్యుఒడికి..

దేవనకొండ: బతుకుదెరువు కోసం కూలి పనికి వచ్చిన మహిళను ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. గోనెగండ్ల మండలం ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన దాసరి పద్మావతి (42), మరి కొంతమంది కూలీలు దిబ్బనగుర్తి గ్రామానికి చెందిన నాగప్ప పొలంలో కూలి పనులకు వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి కప్పట్రాళ్ల గ్రామానికి వెళ్తుండగా చేకూరి మల్లికార్జున పొలం మలుపు వద్ద ఆటోలోని కొంతమంది కూలీలు కిందకు దిగారు. అటుగా వస్తున్న ట్రాక్టర్ (ఏపీ 39 యూఎస్ 9861) కుడివైపు మలుపు వద్ద దాసరి పద్మావతిని గమనించకుండా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పద్మావతి అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాక్టర్ డ్రైవర్ కె.రామ్మోహన్‌రెడ్డి నిర్లక్ష్యంగా వాహనం నడిపి తన భార్య మృతికి కారణమయ్యాడని మృతురాలి భర్త దాసరి చిన్నాంజనేయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

పిడుగు పడి తాటి చెట్టు దగ్ధం


పిడుగుపడి తాటిచెట్టు కాలిపోతున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామ సమీపంలో చెన్నపోయిన పెద్దమద్దిలేటి అనే రైతు పొలంలో తాటిచెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు ఎగిసి ఆ చెట్టు పూర్తిగా కాలిపోయింది. బుధవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. అయితే, పిడుగు పడిన సమయంలో పొలంలో మనుషులు, మూగజీవాలు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు వెల్లడించారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య


మృతి చెందిన మల్లప్ప

ఆదోని అర్బన్: హొళగుంద మండలం ముద్దటమాగి గ్రామానికి చెందిన మూకన్న కుమారుడు మల్లప్ప(23) ధణాపురం గ్రామ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దటమాగి గ్రామానికి చెందిన మల్లప్ప బుధవారం నాగనాథనహళ్లిలోని భార్య పద్మమ్మతో మాట్లాడి ధణాపురం సమీపంలో పురుగు మందు తాగాడు. తర్వాత స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పడంతో స్నేహితులు, బంధువులు అక్కడికి చేరుకుని మల్లప్పను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు బాధితుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య పద్మమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.